మంగళవారం 23-4-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 314, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

## ఈ సారైనా బెయిల్ వచ్చేనా..?

- కవితకు బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ వాదన
- ఇరువురి లాయర్ల మధ్య వాడీవేడీగా వాదనలు
- మే 2వ తేదీకి తీర్పు రిజర్వ్



**ముందడుగు ఢిల్లీ:**

లిక్కర్ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రస్తుతం సీబీఐ కస్టడీలో ఉండగా.. నేడు బెయిల్ పిటిషన్ మీద రౌజ్ ఎవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. అయితే.. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం.. మే 2వ తేదీకి తీర్పును రిజర్వ్ చేసింది. అయితే.. బెయిల్ పిటిషన్ విచారణ సమయంలో అటు కవిత తరపు న్యాయవాదులు, ఇటు సీబీఐ తరపు లాయర్ల మధ్య వాడీవేడీగా వాదనలు జరిగినట్టు తెలుస్తోంది.

ఒక మహిళగా కవిత.. పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం బెయిల్‌కు అర్హురాలని ఆమె తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. అరెస్ట్ నుంచి విచారణ వరకు ఎటువంటి మెటీరియల్ లేదని న్యాయస్థానానికి వివరించారు. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండానే కవితను అరెస్ట్ చేశారని చెప్పుకొచ్చారు. ఈడీ కస్టడీలో ఉన్న సమయంలోనే.. సీబీఐ ఎందుకు అరెస్ట్ చేసిందని ప్రశ్న లేవనెత్తారు. అరెస్ట్ చేయాల్సిన అవసరం లేనప్పటికీ.. అరెస్టు చేశారని కోర్టుకు వివరించారు. బీఆర్ఎస్ పార్టీకి కవిత.. స్టార్ క్యాంపైనర్‌గా ఉన్నారని ధర్మాసనానికి న్యాయవాది తెలిపారు. గతంలో జరిగిన చిదంబరం కేసులోని తీర్పు.. కవిత విషయంలో కూడా సరిగ్గా సరిపోతుందని ప్రస్తావించారు. ఏడేళ్ల లోపల శిక్ష పడే కేసులకు అరెస్ట్ అవసరం లేదని ధర్మాసనానికి.. కవిత తరపున న్యాయవాది గుర్తు చేశారు.

ఈ కేసులో కవితకు బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ వాదించింది. కేసు దర్యాప్తును కవిత ప్రభావితం చేయగలుగుతారని ధర్మాసనానికి వివరించింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవిత కీలక వ్యక్తిగా ఉన్నారని.. బెయిల్ ఇస్తే సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశాలు ఉన్నాయంటూ వాదించింది. సాక్ష్యాలను ధ్వంసం చేసే అవకాశం కూడా ఉందని చెప్పింది. లిక్కర్ కేసులో కవిత కింగ్ పిన్ అని మరోసారి చెప్పుకొచ్చిన సీబీఐ.. బెయిల్ ఇవ్వొదని గట్టిగానే వాదించింది. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పును మే 2వ తేదీకి రిజర్వ్ చేసింది. దీంతో.. ఏం జరగనుందోనని బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## బాంచన్ వడ్లు కొనండి సారూ..

- పోలీసుల కాళ్లు మొక్కిన మహిళ రైతు
- కన్నీరు పెడుతున్న అన్నదాతలు



**ముందడుగు జనగాం:**

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే చాలా వరకు కోతలు అయిపోయి.. రైతులు ధాన్యాన్ని కల్లాల్లోకి తరలించారు. ఇప్పటికీ ఇంకొన్ని ప్రాంతాల్లో పంటలు కోతలకు రాగా.. చాలా వరకు ధాన్యం కల్లాల్లో ఉంది. సుమారు 15 రోజులుగా ఎప్పుడెప్పుడూ అధికారులు వడ్లు కొంటారా అని కళ్లల్లో వత్తులేసుకుని మరీ రైతులు కల్లాల్లో పడిగాపులు కాస్తున్నారు. పంటకు కావాల్సినప్పుడు ముఖం చాటేసిన వరుణుడు.. పంట కోతకు వచ్చే సమయంలోనో, ధాన్యం కల్లాల్లోకి వచ్చిన తర్వాతో పనిగట్టుకుని మరీ విరుచుకుపడుతూ.. ఆరుగాలం పడి కష్టాన్ని నేలపాలు చేస్తూ.. అన్నదాతల గుండెలను చెరువులు చేస్తుండటం బాధాకరం.

రాష్ట్రంలో ఎన్నికల హడావుడి జోరుగా నడుస్తుండటంతో.. రైతులను పట్టించుకునే నాథుడు కరువవటంతో.. పూర్తిగా ఎండిపోయిన ధాన్యం కాస్తా.. అకాల వర్షాల ధాటికి తడిపోయి.. వరదల్లో కొట్టుకుపోతుంది. దీంతో.. కన్నెర్ర చేసిన రైతులు రోడ్డెక్కి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. జనగాం మార్కెట్లో వడ్లు కొనాలి అంటూ రైతులు, కమ్యూనిస్టు నేతలు ఆందోళన చేశారు. ఆ సమయంలో వాళ్లను చెదరగొట్టేందుకు పోలీసులు రాగా.. అక్కడే ఉన్న ఓ మహిళా రైతు.. "మీ బాంచన్ వడ్లు కొనండి సారూ.." అంటూ పోలీసుల కాళ్లు మొక్కుతుండటం అందరి గుండెలను మెలిపెట్టేసింది.

ఈ దృశ్యం చూసైనా.. అధికారులు, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రతిపక్షాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను వర్షా లపాలు కాకుండా.. ప్రభుత్వమే కొని రైతులను ఆదుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే సరైన నీరు అందక.. అంతంత మాత్రమే పంట పండిందని.. వచ్చిన దిగుబడి కూడా ఇలా అకాల వర్షా ల పాలైతే.. రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు.

## తెలంగాణలో బిజెపి క్లీన్ స్వీప్

- మోడీ హవాతో అన్ని స్థానాల్లో గెలుస్తాం
- చేవెళ్లలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

**ముందడుగు హైదరాబాద్:**



తెలంగాణలో బిజెపి పార్టీ క్లీన్ హైదరాబాద్ సహా మెజార్టీ స్థానాల్లో గెలువబోతుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎన్డీయే కూటమి 400కు పైగా సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ పాలనలో ప్రతి మిగతా 2లో



## 14ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తికి సుప్రీంకోర్టు ఓకే

### అత్యాచార బాధితురాలి గర్భం తీసివేయాలని ఆదేశం

**ముందడుగు మహారాష్ట్ర:**

అత్యాచారానికి గురై గర్భం దాల్చిన ఓ 14 ఏండ్ల బాలికకు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. దాదాపు మిగతా 2లో

## కేసీఆర్, మోడీ ఇద్దరూ తోడు దొంగలే

- సీసీఐ సిమెంట్ పరిశ్రమ కలిసి మూసేశారు
- ఆదిలాబాద్ 'జనజాతర' సభలో రేవంత్‌రెడ్డి

**ముందడుగు ఆదిలాబాద్:**



మోడీ, కేసీఆర్ ఇద్దరూ తోడుదొంగలేనని, ఇక్కడ ఉన్న సీసీఐ సిమెంట్ పరిశ్రమను మోడీ, కేసీఆర్ కలిసి మూసేశారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మిగతా 2లో

ముందడుగు
మంగళవారం 23-4-2024 హైదరాబాద్

## కేసీఆర్, మోడీ ఇద్దరూ తోడు దొంగలే

మొదటిపేజీ తరువాయి



తెలంగాణలో ఐదు గ్యారంటీలు అమలు చేశామని, త్వరలోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కూడా పూర్తిచేస్తామని తెలిపారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జనజాతర' సభలో ఆయన మాట్లాడారు. ''నాగోబా జాతరకు రూ.4 కోట్లు కేటాయించనున్నాం. కుప్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్‌ను సస్యశ్యామలం చేస్తాం. తుమ్మిడిహట్టిలో ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు కడతాం.. దానికి బీఆర్ అంబేడ్కర్ పేరు పెడతాం. ఆదిలాబాద్‌లో కొత్త యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం.

తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అన్నదాత పండించిన ప్రతి గింజ కొంటున్నాం. ఉచిత బస్సుల్లో 35 కోట్ల మంది మహిళలు ప్రయాణించారు. పదేళ్లలో కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వకుంటే.. కాంగ్రెస్ 3 నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చింది. బీసీ జనగణన చేయాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. తొందరల్లోనే దీన్ని తెరిపిస్తాం. రూ.500కే మేం గ్యాస్ సిలిండర్ ఇస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టాలని వాళ్లిద్దరూ అంటున్నారు. ఉచిత కరెంటుతో పేదల ఇళ్లు వెలుగుతుంటే వాళ్ల కడుపు మండుతోంది. గత ప్రభుత్వ పాలనలో పండించిన ధాన్యం కొనకపోవడంతో రైతులు కల్లాల్లోనే చనిపోయారు'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## తెలంగాణలో బిజెపి క్లీన్ స్వీప్

మొదటిపేజీ తరువాయి

కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇండియా కూటమిలోని పార్టీల్లో ఐకమత్యం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కేరళలో సీపీఐతో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ చేస్తోందని ఎద్దేవా చేశారు. 2047 నాటికి వికసిత్ భారతే తమ లక్ష్యమన్నారు. మోడీ హవాతో ఈ ఎన్నికల్లో తెలంగాణలో క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అనంతరం చేవెళ్ల లోక్‌సభ స్థానానికి భాజపా అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. రాజేంద్రనగర్‌లోని ఆర్వో కార్యాలయంలో ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శశాంకకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## 14ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తికి సుప్రీంకోర్టు ఓకే

మొదటిపేజీ తరువాయి

30 వారాల ఆమె గర్భాన్ని వైద్యపరంగా విచ్ఛిత్తి చేసుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. మహారాష్ట్రకు చెందిన ఓ 14 ఏళ్ల బాలిక లైంగికదాడికి గురై గర్భం దాల్చింది. కూతురు గర్భం దాల్చిందన్న విషయం తల్లికి తెలియడంతో, ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తన బిడ్డ 28 వారాల గర్భాన్ని తొలగిచేందుకు అనుమతించాలని ఏప్రిల్ మొదటి వారంలో పిటిషన్ దాఖలు చేశారు. బాంబే హైకోర్టు విచారణ జరిపి అబార్షన్‌కు నిరాకరించింది. దీంతో బాలిక తల్లి దాఖలు చేసిన పిటిషన్‌ను ఏప్రిల్ 4న కోర్టు కొట్టేసింది. బాంబే హైకోర్టు తీర్పుపై బాధితురాలి తల్లి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు.. ముంబైలోని సియాన్ ఆస్పత్రి మెడికల్ బోర్డును నివేదిక కోరింది. గర్భవిచ్ఛిత్తిపై తీసుకునే నిర్ణయం వల్ల బాలిక శారీరక, మానసిక పరిస్థితి ఎలా ఉండనుందో చెప్పాలని కోర్టు కోరింది. ఈ సమయంలో అబార్షన్ చేస్తే కొంత ప్రమాదం ఉన్నప్పటికీ, కాన్పు తర్వాత ఎదురయ్యే ముప్పుతో పోలిస్తే ఇది ఎక్కువ కాదు. ఈ గర్భాన్ని కొనసాగించడం వల్ల బాలికపై శారీరకంగా, మానసికంగా ప్రతికూల ప్రభావం పడుతుందని మెడికల్ బోర్డు తన నివేదికలో తెలిపింది. ఈ నివేదికను పరిశీలించిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం బాలిక 30 వారాల గర్భవిచ్ఛిత్తికి అనుమతించింది.



## సూరత్‌లో బిజెపి ఎంపీ అభ్యర్థి ఏకగ్రీవం

- కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ
- మిగతా 8 మంది నామినేషన్లు ఉపసంహరణ

**ముందడుగు గుజరాత్:**

దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో గుజరాత్‌లోని సూరత్ స్థానం నుంచి బిజెపి పార్టీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈ నియోజకవర్గం నుంచి పోటీకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురవడం, పోటీలో ఇంకెవరూ లేకపోవడంతో దలాల్ విజయానికి మార్గం సుగమమైంది.

సూరత్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న నీలేశ్ కుంభనీ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఆదివారం తిరస్కరించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన నేతల సంతకాల్లో అవకతవకలు జరిగినట్లు తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్వో వెల్లడించారు. ఆయనకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ నుంచి వేసిన మరో నామినేషన్ కూడా చెల్లనిదిగా ప్రకటించారు. ఇదే స్థానం నుంచి పోటీకి దిగిన మిగతా 8 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజైన సోమవారం వీరంతా పోటీ నుంచి వైదొలిగారు. వీరిలో స్వతంత్రులతో పాటు బీఎస్పీ అభ్యర్థి కూడా ఉండటం గమనార్హం. పోటీలో ముకేశ్ దలాల్ ఒక్కరే మిగలడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యారు.

## మల్కాజిగిరి ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా 'భారత సుదర్శన్' నామినేషన్



**ముందడుగు హైదరాబాద్:**

మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా సామాజిక ఉద్యమనేత భారత సుదర్శన్ సోమవారం నాడు మేడ్చల్ కలెక్టరేట్ లో తన నామినేషన్ ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యమనేత భారత సుదర్శన్ మాట్లాడుతూ.. దేశంలో పేద, మధ్య తరగతి ప్రజలకు కనీస హక్కులు, సౌకర్యాలు అందడంలేదన్నారు. దేశంలో పెట్టుబడిదారీ రాజకీయాలు పెచ్చరిల్లిపోవడంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు తీరని సంక్షోభంలో చిక్కుకుంటున్నారన్నారు. ఎన్నకలంటే ధనస్వాములు, బడాబాబుల పండుగ కాదని, ఎన్నికలంటే సామాన్యుడి బతుకుతెరువని, ఎన్నికల్లో సామాన్యులనే గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బింది ప్రవీణ్ కుమార్ నేత, బోల్ల అరవింద్, వూదరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

## కువైట్‌లో తొలిసారిగా హిందీ రేడియో ప్రసారాలు

### ప్రతి ఆదివారం రాత్రి 8.30కి కార్యక్రమాలు



**ముందడుగు కువైట్:**

హిందీలో రేడియో ప్రసారాలు కువైట్‌లో తొలిసారిగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని కువైట్‌లో భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ప్రతి ఆదివారం రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు ఎఫ్ఎం 93.3, ఎఫ్ఎం 96.3 ఫ్రీక్వెన్సీల్లో హిందీ కార్యక్రమాలు ప్రసారమవుతాయని తెలిపింది. హిందీలో కార్యక్రమాలను ప్రసారం చేయడంపై కువైట్ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖపై భారత రాయబార కార్యాలయం ప్రశంసలు కురిపించింది. కువైట్ రేడియోలో హిందీ ప్రసారాలు ప్రారంభంకావడం ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగుపరుచుకోవడంలో కీలకంగా మారనున్నాయని పేర్కొంది. ఇదిలా ఉండగా.. చాలా సంవత్సరాలుగా భారత్, కువైట్ మధ్య సత్సంబంధాలు కొనసాగుతూ వస్తున్నాయి. దాదాపు 10లక్షల మంది భారతీయులు కువైట్‌లో నివసిస్తున్నారు. ఇంజినీర్లు, డాక్టర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, శాస్త్రవేత్తలు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లు, టెక్నీషియన్లు, నర్స్, రిటైలర్లు, వ్యాపారవేత్తలు సైతం ఇక్కడ నివాసం ఉంటున్నారు.

## కేజ్రీవాల్‌కు బెయిల్‌పై న్యాయ విద్యార్థి పిటిషన్

### పిటిషనర్‌కు రూ.75వేల జరిమానా విధించిన కోర్టు

**ముందడుగు ఢిల్లీ:**



కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకొని అసాధారణ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని న్యాయ విద్యార్థి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషన్‌ను తిరస్కరిస్తూ.. మధ్యంతర బెయిల్‌ను కోరిన పిటిషనర్‌కు రూ.75వేల జరిమానా విధించింది. న్యాయ విద్యార్థి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ కోసం.. 'వి ది పీపుల్ ఆఫ్ ఇండియా' పేర్కొన్న నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థి పిల్ దాఖలు చేశాడు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీతో ఈడీ మనీలాండరింగ్ కేసుతో సహా అన్నింట్లో అసాధారణ మధ్యంతర బెయిల్ ఇస్తూ విడుదల చేయాలని కోరారు. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిల్‌ను ఢిల్లీ ముఖ్యమంత్రి స్వయంగా వ్యతిరేకించారు. దీన్ని 'ఆకస్మిక దాడి'గా ఆయన అభివర్ణించారు. కేజ్రీవాల్ తరఫు న్యాయవాది ఈ పిటిషన్‌ను 'పబ్లిసిటీ లిటిగేషన్'.. రాజకీయ ప్రేరేపితమన్నారు. కేవలం పబ్లిసిటీ కోసం చేసిందని, పిటిషన్ దాఖలు చేయడానికి పిటిషనర్ ఎవరు? కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది రాహుల్ మెహ్రా ప్రశ్నించారు. ఈ సందర్భంగా పిటిషనర్‌పై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు నీకు నువ్వు ఏమనుకుంటున్నావని తీవ్రంగా స్పందించింది. పిటిషన్‌ను తిరస్కరిస్తూ రూ.75వేల జరిమానా విధించింది.

ముందడుగు
మంగళవారం 23-4-2024 హైదరాబాద్

# సరిపడా నిద్రలేకుంటే షుగర్ వ్యాధి ముప్పు

## గుర్తించిన బ్రిటన్ పరిశోధకులు

**ముందడుగు జాతీయం:**



మనిషికి నిద్ర చాలా అవసరం. వయస్సును బట్టి ఏ మనిషికి ఎంత నిద్ర అవసరమో చెప్పవచ్చు. కానీ మొబైల్ పుణ్యమాని మనిషి నిద్ర రోజురోజుకు తగ్గిపోతుంది. మనిషికి సరిపడా నిద్ర లేకుంటే మధుమేహ వ్యాధి ముప్పు పెరుగుతున్నదని బ్రిటన్‌కు చెందిన పరిశోధకులు గుర్తించారు. యూకే బయోబ్యాంక్‌లోని 2.5 లక్షల మంది డాటాను అధ్యయనం చేసిన తర్వాత షుగర్ వ్యాధికి, నిద్రకు సంబంధం ఉందని పరిశోధకులు తేల్చారు. ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలి మధుమేహ ముప్పును దూరం చేస్తుందని, ఇదే సమయంలో సరిపడా నిద్ర పోవడం కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు.

సాధారణంగా ఒక మనిషి రోజుకు 7 - 8 గంటలు నిద్రపోవాలని, ఆరు గంటల కంటే తక్కువ సమయం నిద్రపోతున్న వారిలో షుగర్ వ్యాధి ముప్పు పెరుగుతున్నట్టు గుర్తించారు. రోజుకు 7 - 8 గంటలు నిద్రపోతున్న వారితో పోలిస్తే ఐదు గంటల పాటు నిద్ర పోతున్న వారిలో మధుమేహం బారిన పడే ముప్పు 16 శాతం ఎక్కువని, రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు నిద్రపోతున్న వారిలో 41 శాతం ఎక్కువని పరిశోధకులు తేల్చారు. కచ్చితంగా రోజుకు 7 - 8 గంటల పాటు మంచి నిద్ర ఉండేలా చూసుకోవాలని సూచించారు.

# అరటి ఆకులతో పోలింగ్ కేంద్రం ముస్తాబు

## అధికార యంత్రాంగం వినూత్న ఆలోచన

**ముందడుగు తమిళనాడు:**



మండే ఎండలు, మరో పక్క దేశంలో లోక్‌సభ ఎన్నికల సందడి.. భానుడి ప్రతాపానికి మండుటెండల్లో క్యూలో నిలబడి ఓటు వేయాలంటే ప్రజలు భయపడిపోతున్నారు. ఈనేపథ్యంలోనే ఆహ్లాదకర వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు తమిళనాడు అధికార యంత్రాంగం చేసిన వినూత్న ఆలోచన అందరినీ ఆకర్షిస్తోంది.

ఎండ నుంచి ఉపశమనం కోసం తిరుపత్తూరు జిల్లాలోని పోలింగ్ బూత్ ఎదుట కొబ్బరి, వెదురు, అరటి ఆకులతో పందిరి వేసి అందంగా ముస్తాబు చేశారు. దీంతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది. ఎలాంటి ఇబ్బందిలేకుండా వృద్ధులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను ఐఏఎస్ అధికారిణి సుప్రియసాహు 'ఎక్స్'లో షేర్ చేశారు. "ఎండ, వడగాల్పుల నుంచి ఓటర్లకు ఉపశమనం కలిగించేలా.. పర్యావరణం కోసం పనిచేసే ఓ స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలోని యువకులతో కలిసి జిల్లా యంత్రాంగం గ్రీన్ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసింది. పచ్చని తోరణాలు ఓటర్లకు స్వాగతం పలికాయి" అని పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన ఈ ఫోటోస్ నెటిజన్లను ఆకట్టుకొంది.

# హైస్కూల్ పూర్తవగానే లా ప్రాక్టీస్ చెయ్యండి

- పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- న్యాయవిద్యకు ఐదేళ్ల కోర్సు కూడా తక్కువే

**ముందడుగు ఢిల్లీ:**



లా కోర్సుకు "మూడేళ్లు కూడా ఎందుకు..? హైస్కూల్ పూర్తవగానే నేరుగా లా ప్రాక్టీస్ మొదలుపెట్టేయండి" అంటూ పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. "వాస్తవానికి న్యాయవిద్యకు ఐదేళ్ల కోర్సు కూడా తక్కువే. అయితే ప్రస్తుత విధానం సరిగ్గానే పనిచేస్తోంది. దీనిపై ఆలోచించడానికి ఏం లేదు. ఇక, ప్రస్తుతం జిల్లా స్థాయి న్యాయవ్యవస్థల్లో 70శాతం మంది మహిళలు ఉన్నారు. రానున్న రోజుల్లో మరింతమంది ఇందులో చేరుతారు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని ఆదేశించింది.

ప్రస్తుతం.. డిగ్రీ పూర్తి చేసినవారు మూడేళ్ల లా కోర్సుల్లో, ఇంటర్ లేదా 12వ తరగతి ఉత్తీర్ణులైనవారు అయిదేళ్ల లా కోర్సుల్లో చేరడానికి అర్హులు. అయితే, ఇంటర్ తర్వాత నేరుగా మూడేళ్ల కోర్సుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని నియమించేలా కేంద్రం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించాలని కోరుతూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ పిటిషన్ దాఖలు చేశారు. మేధావులైన విద్యార్థులు మూడేళ్లలోనే న్యాయవాద కోర్సును పూర్తి చేయగలరని, ప్రస్తుత విధానం వల్ల అయిదేళ్ల కోర్సుతో వారికి సమయం వృథా అవుతుందని పేర్కొన్నారు. దీనివల్ల పేదలు, ముఖ్యంగా అమ్మాయిలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.



# రాహుల్ గాంధీది మావోయిస్టు మనస్తత్వం

## బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్

**ముందడుగు, నేషనల్ బ్యూరో:**

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ లక్ష్యంగా కాషాయ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. రాహుల్ గాంధీకి మావోయిస్ట్ ఆలోచనా విధానం ఉందని బీజేపీ ఎంపీ రవి శంకర్ ప్రసాద్ ఆరోపించారు. దేశంలో ప్రతి ఒక్కరి ఆస్తులపై విచారణ చేస్తానని చెబుతున్న రాహుల్ నేషనల్ హెరాల్డ్ స్కామ్‌లో తాను కూడబెట్టిన ఆస్తులపై విచారణ జరిపించగలరా అని ఆయన సవాల్ విసిరారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పదేపదే మైనారిటీల గురించి ప్రస్తావించిందని, దేశ వనరులపై ముందుగా మైనారిటీలకు తొలి హక్కు ఉందని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గతంలో అన్నారని పేర్కొంది.

# అత్యాచారం చేసిన నిందితుడి ఇంటికి బుల్డోజర్..

## ఘటనపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం సీరియస్

**ముందడుగు మధ్యప్రదేశ్:**





ఓ యువతిపై అత్యాచారం చేయడమే కాకుండా ఆమెను తీవ్ర శారీరక హింసకు గురిచేసిన ఘటన మధ్యప్రదేశ్ గుణా జిల్లాలో ఇటీవల వెలుగులోకి వచ్చింది. యువతి తల్లి పేరు మీద ఉన్న ఆస్తిని తన పేరుపైకి మార్చనందుకు అయాన్ పఠాన్ అనే నిందితుడు యువతిని బంధించి లైంగిక దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా యువతిని బెల్టు, పైపుతో కొట్టడమే కాకుండా, గాయాలు, కళ్లలో కారం పోశాడు. యువతి అరవకుండా పెదాలను ఫెవిక్విక్‌తో మూశాడు. అతికష్టం మీద అతడి నుంచి తప్పించుకున్న యువతి ప్రాణాలు దక్కించుకుంది. ప్రస్తుతం ఆమెకు చికిత్స జరుగుతోంది.

ఈ ఘటనపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ రోజు స్థానిక పరిపాలన అధికారులు బుల్డోజర్‌తో నిందితుడి ఇంటికి వచ్చి కూల్చివేత నోటీసులు అంటించారు. అతడిపై బుల్డోజర్ చర్యలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు, సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కొరకు నేరస్థలానికి తీసుకువచ్చారు. దాడికి ఉపయోగించిన బెల్ట్, ఫెవిక్విక్ ట్యూబ్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు డ్రగ్స్ తీసుకున్నట్లుగా పోలీసులు తెలిపారు. అతడిని చూసి స్థానికులు భయపడేవారని, తరుచూ గొడవలు పెట్టుకునేవాడని అక్కడి ప్రజలు చెప్పారు. చట్టవిరుద్ధంగా నిర్మించిన నిందితుడి ఇంటిని అధికారులు కూల్చేయబోతున్నారు.

ముందడుగు
మంగళవారం
23-4-2024
హైదరాబాద్



# యోడా డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం

**9వ నిజాం, రౌనక్ యార్ ఖాన్, మెగా స్టార్ చిరంజీవి హజరు**

**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో యోడా డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అసఫ్ జాహీ వంశానికి చెందిన 9వ నిజాం నవాబ్ రౌనక్ యార్ ఖాన్ సాంప్రదాయ పూజలో పాల్గొన్నారు.

నవాబ్‌తో పాటు అతని చిన్ననాటి స్నేహితుడు తెలంగాణ ఆరోగ్య మంత్రి దామోదర్ నర్సింహ, సినీ మెగా స్టార్ చిరంజీవి కూడా హజరయ్యారు. జూబ్లీహిల్స్‌లోని నవాబ్ యొక్క విస్తారమైన ఎస్టేట్‌ను సినిమా సెట్‌లను రూపొందించడానికి ఉపయోగించుకోవడంలో ప్రసిద్ధి చెందింది. ఈ సహకారం ఈ ప్రముఖ వ్యక్తుల మధ్య సన్నిహిత బంధాన్ని ప్రదర్శిస్తుంది.

# ఆంధ్రాలో ఇండియాలోనే ధనిక ఎంపీ అభ్యర్థి

## పెమ్మసాని చంద్రశేఖర్ ఆస్తులు రూ.5598 కోట్లు

**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**

దేశవ్యాప్తంగా ఎంపీ స్థానాల్లో నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు తమ ఆస్తుల్ని తక్కువగానే చూపిస్తుంటారు. అయితే అమెరికాలోని మెడికల్ ఎడ్యుకేషన్ ఫీల్డ్ లో ఉన్న డాక్టర్ పెమ్మసాని మాత్రం తనకు ఎన్ని ఆస్తులు ఉన్నాయనే విషయాన్ని నిర్భయంగా ప్రకటించారు. పెమ్మసాని చంద్రశేఖర్ కుటుంబానికి మొత్తంగా రూ.5598 కోట్ల ఆస్తులు ఉన్నాయి. స్థిరాస్తులతో పాటు చరాస్తులు కూడా ఉన్నాయి కానీ అందులో కుటుంబ సభ్యు



లవి కూడా ఉన్నాయి. అప్పులు వెయ్యి కోట్లరూపాయలు ఉన్నట్లు చూపించారు. ఎంబీబీఎస్ వరకు భారత్ లోనే చదువుకున్న పెమ్మసానిపై చదువుల కోసం అమెరికాకు వెళ్లి అక్కడే వైద్యరంగంలో స్థిరపడ్డారు. యూవరల్డ్ పేరుతో అమెరికాలో వైద్య పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఆన్ లైన్ ఎడ్యూటెక్ కంపెనీని నడుపుతున్నారు. ఇది ప్రధానమైనదే అయినప్పటికీ ఇంకా మరికొన్ని కంపెనీలు కూడా ఉన్నాయి. జన్మభూమికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఏపీకి తిరిగివచ్చారు. అమెరికాలో ఉన్న సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా, ప్రధానంగా పల్నాడులో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు.

# శ్రీకృష్ణుడి విగ్రహంతో యువతి పెళ్లి

**బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా వివాహం**



**ముందడుగు మధ్యప్రదేశ్:**

శ్రీకృష్ణుడిని చిన్నప్పటి నుంచి ఆరాధించిన ఓ యువతి వేదమంత్రాల సాక్షిగా శ్రీకృష్ణుడి విగ్రహంతో వివాహం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగిందీ ఘటన. 23 ఏళ్ల శివానీ పరిహార్‌కు శ్రీకృష్ణుడంటే చిన్నప్పటి నుంచి విపరీతమైన భక్తి. తనతోపాటే అది పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో ఆయననే పెళ్లి చేసుకోవాలని భావించింది. విషయాన్ని ఇంట్లో చెప్పి తల్లిదండ్రులను ఒప్పించింది. బుధవారం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని బంధుమిత్రుల సమక్షంలో వివాహం చేసుకుంది. వేదమంత్రాల సాక్షిగా జరిగిన ఈ పెళ్లి అనంతరం వధువుకు అప్పగింతల కార్యక్రమం కూడా నిర్వహించారు. అంతకుముందు వరుడు శ్రీకృష్ణుడి విగ్రహం బృందావనం నుంచి బ్యాండు మేళాలతో ఊరేగింపుగా వచ్చింది. అనంతరం స్థానిక ఆలయంలో పెళ్లి ఘనంగా జరిగింది. వివాహానంతరం శివానీ వివాహ ప్రమాణ పత్రం కూడా అందుకుంది. అనంతరం శ్రీకృష్ణుడి విగ్రహంతో కలిసి బృందావనం బయలుదేరింది. అక్కడి రాధా ధ్యాన్ ఆశ్రమంలో శ్రీకృష్ణుడి సేవలో తన తదుపరి జీవితాన్ని గడపనుంది.



# ఫ్రీ బస్ తీసేస్తారట

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ముందడుగు, స్టేట్ బ్యూరో:**

జన సమస్యలే అజెండాగా, కాంగ్రెస్, బీజేపీ మోసాలను ఎండగడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కొట్లాడదామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల తెలంగాణ భవన్ లో సోమవారం (ఏప్రిల్ 22) సిరిసిల్ల పట్టణ క్లస్టర్ స్థాయి సమావేశంలో పాల్గొని పార్లమెంటు ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. "గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో చాలా స్థానాల్లో స్వల్ప మెజారిటీ తేడాలో కాంగ్రెస్ విజయం సాధించింది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పై 100 రోజుల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకే విజయ అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. కాంగ్రెస్ కు ఓటు వేయకపోతే ఫ్రీ బస్సు తీసేస్తాం అంటున్నరు. ప్రజలు ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్ మోసపు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్ కు చేసిందేమీ లేదు. ఐదేళ్లలో ఒక్క పాఠశాల, ఒక్క కళాశాల తీసుకొచ్చాడా? ఒక్క గుడి కట్టాడా? ఒక్క పరిశ్రమనైనా తీసుకొచ్చారా? ఒక్క రూపాయి పని చేయని బండి సంజయ్ కు ఓట్లు అడిగే అర్హత లేదు. మోదీ పదేళ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి. తెలంగాణకు ఏమీ చేయని బీజేపీకి, కరీంనగర్ కు నయాపైసా పని చేయని బండి సంజయ్ కు ఓటు ఎందుకు వేయాలో ప్రజల్లో చర్చ పెట్టాలి. రాష్ట్రంలో 8 నుంచి 10 స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచే ఛాన్స్ ఉందని పలు సర్వే సంస్థలు చెబుతున్నాయి.

# రాష్ట్రపతి భవన్‌లో 'పద్మ' పురస్కారాలు అందజేత

- **132 మందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధానం**
- **అవార్డు గ్రహీతలలో 30 మంది మహిళలు**

**ముందడుగు ఢిల్లీ:**

ఈ ఏడాది జనవరి 25న పద్మ పురస్కారాలు ప్రకటించిన 132 మందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్రపతి భవన్‌లో అవార్డులను ప్రదానం చేశారు. ఐదుగురు పద్మవిభూషణ్, 17 మంది పద్మభూషణ్, 110 మందికి పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ ఏడాది పద్మ అవార్డు గ్రహీతలలో 30 మంది మహిళలు ఉన్నారు. అదేవిధంగా విదేశీ, ఎన్ఆర్ఐ, పిఐఓ, ఓసిఐ కేటగిరీకి చెందిన వారు 8 మంది పద్మ అవార్డులను అందుకున్నారు. మరణానంతరం 9 మందికి పద్మ పురస్కారాలు దక్కాయి. కాగా



పద్మ అవార్డుల ప్రదానోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్, హోంమంత్రి అమిత్‌షాతోపాటు పలువురు కేంద్ర మంత్రులు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, సామాజిక కార్యకర్త బిందేశ్వర్ పాఠక్ తరపున ఆయన సతీమణి అమోలా పాథక్, కళా రంగానికి అందించిన సేవలకు గాను పద్మా సుబ్రమణ్యం తదితరులు పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకున్నారు.

# మాధవీలతను హగ్ చేసుకున్న సైదాబాద్ ఏఎస్ఐ సస్పెండ్

ముందడుగు,స్టేట్ బ్యూరో: బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతను హగ్ చేసుకున్న సైదాబాద్ ఏఎస్ఐపై సస్పెన్షన్ వేటు పడింది. హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో సైదాబాద్ ఏఎస్ఐ ఉమాదేవి ఆమెను హగ్ చేసున్నారు. అయితే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, కోడ్ ఉల్లంఘించిన ఉమాదేవిని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సస్పెండ్ చేశారు.

